క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి దాతల కృషి భేష్



విరాళం అందజేస్తున్న రామకృష్ణ

నిజాంపేట్: దేవాలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. నిజాంపేట్ శ్రీనివాసనగర్ కాలనీలో నూతనంగా చేపడుతున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి కేటీఆర్ కాలనీ ప్రెసిడెంట్ రామకృష్ణ శనివారం రూ. 25 వేల విరాళాన్ని డిప్యూటీ మేయర్ చేతుల మీదుగా ఆలయ చైర్మన్ కొలన్ చంద్రశేఖర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు హరి, కేటీఆర్ కాలనీ నేతలు వెంకటేష్, భూపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు ప్రహరీ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు?



వినియోగిస్తున్న నాసిరకం నిర్మాణ సామగ్రి

సుభాష్‌నగర్: గాజులరామారం సర్కిల్ మహదేవపురం కాలనీలో చేపడుతున్న పార్కు ప్రహరీ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నాడు. రాళ్లు, ఇటుక వ్యర్థాలతో బేస్‌మెంట్‌ను చేపడుతుండటంతో ప్రహరీ నాణ్యత దెబ్బతినే ప్రమాదముందని స్థానికులు పేర్కొంటున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో కాంట్రాక్టర్ ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ



విద్యార్థుల మార్కులను వివరిస్తున్న రాణి రుద్రమదేవి, పద్మజ

నిజాంపేట్: సీబీఎస్ఈ పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో నిజాంపేట్‌కు చెందిన విజ్ఞాన్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దిబ్య జ్యోతి బారిక్ (493/500), కుమార్ సంకేత్ (491/500), రాగ కీర్తన (490/500) మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ రాణి రుద్రమదేవి మాట్లాడుతూ... ముగ్గురు విద్యార్థులు 90 శాతం, 321 మంది విద్యార్థులు 80 శాతానికిపైగా మార్కులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. అధ్యాపకుల కృషి విద్యార్థుల పట్టుదలతోనే ఇది సాధ్యపడిందన్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి నిత్యం స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ వచ్చామని, నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల మనోవికాసానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

'సూపర్‌మ్యాక్స్' కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం



జీడిమెట్ల: సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికులకు న్యాయం జరిగే వరకు వారికి తోడుగా ఉంటానని బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్లలోని సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికులు పరిశ్రమ యాజమాన్యం జీతాలు చెల్లించాలని 76 రోజులుగా ధర్నా చేస్తున్నారు. విషయం తెలుసుకున్న భరతసింహారెడ్డి శనివారం దీక్షా శిబిరానికి వచ్చి కార్మికులకు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో మాట్లాడుతూ... న్యాయం జరిగే వరకు మీ వెంటే ఉంటానని స్పష్టం చేశారు. ఇకనైనా పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు రావాల్సిన జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు న్యాయం చేయని సందర్భంలో న్యాయపరంగా కొట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఆయన యాజమాన్యాన్ని హెచ్చరించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో 59 జీఓ కింద 10 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలు ఉండి పట్టాలు లేక ఇబ్బంది పడుతున్న పేద ప్రజలకు ఆ స్థలాలను రెగ్యులరైజ్ చేసిన నాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు.

నిధుల ఖర్చుకూ బద్ధకమే..!

అభివృద్ధి పనులకు నిధులు ఖర్చుచేయని ఎమ్మెల్యేలు

- ఐదుగురు ఎమ్మెల్యేలకు 2021–22లో రావాల్సిన సీడీపీ నిధులు 15 కోట్లు
- ప్రభుత్వం కేటాయించింది రూ. 9.36 కోట్లు
- వివిధ అభివృద్ధి పనులకు చేసిన ఖర్చు రూ. 3.39 కోట్లు
- 2022–23లోనూ రూ.7.06 కోట్ల కేటాయింపు – ఖర్చు చేసింది సున్నా

సాక్షి, మేడ్చల్ జిల్లా: నియోజకవర్గాల్లోని సమస్యల పరిష్కారానికి నియోజకవర్గ అభివృద్ధి పథకం కింద ఎమ్మెల్యేకు ప్రభుత్వం ఏటా నిధులు విడుదల చేస్తుంది. ప్రభుత్వం కేటాయించిన నిధులతో తమ నియోజకవర్గాల్లో పనులు చేయించాలి. అయితే కొందరు ఎమ్మెల్యేలు మాత్రం వాటిని వినియోగించడంపై శ్రద్ధ చూపడం లేదు. ప్రభుత్వం ఏటా ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి రూ.5 కోట్లు విడుదల చేస్తోంది.

40 శాతం నిధులు ప్రభుత్వ బడులకే...

నియోజకవర్గ అభివృద్ధి పథకం కింద ఎమ్మెల్యేలకు ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధుల్లో 40 శాతం నిధులను నేరుగా మన ఊరు– మన బడి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేటాయిస్తున్నారు. ఇక మిగతా 80 శాతం నిధులు ప్రజాప్రతినిధులు నియోజకవర్గాల్లో ప్రజల సమస్యలు తీర్చేందుకు వినియోగించాల్సి ఉంటుంది. గ్రామాల్లో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలతో పాటు ప్రజలకు అవసరమయ్యే ఇతర సదుపాయాలు కల్పించేందుకు ఖర్చు చేయాల్సి ఉంది.



నియోజకవర్గం అభివృద్ధి నిధుల ఖర్చు ఇలా

మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలో నియోజకవర్గ అభివృద్ధి పథకం కింద 2021–22 సంవత్సరంలో ప్రభుత్వం ఐదుగురు ఎమ్మెల్యేలకు రూ.15 కోట్లు మంజూరు చేయగా అందులో రూ.936.46 లక్షలు నిధులను 234 అభివృద్ధి పనులకు కేటాయించారు. వాటిలో113 పనులు పూర్తి కాగా, ఇంకా 121 పనులు ప్రారంభానికి నోచుకోలేదు.

మంత్రి నియోజకవర్గంలో కేవలం 74 లక్షలే ఖర్చు



మంత్రి మల్లారెడ్డి

- మేడ్చల్‌లో సీడీపీ కింద 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఎమ్మెల్యే మంత్రి సీహెచ్ మల్లారెడ్డికి ప్రభుత్వం రూ.3 కోట్లు నిధులు మంజూరు చేసింది. నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.248 లక్షలు కేటాయించారు. అందులో ఇప్పటి వరకు రూ.74.31 లక్షలకు సంబంధించిన పనులు మాత్రమే పూర్తయ్యాయి. మిగతా రూ.173.69 లక్షలతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు.

కుత్బుల్లాపూర్‌లో ఇలా..



ఎమ్మెల్యే వివేకానంద్

- కుత్బుల్లాపూర్‌లో 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు ప్రభుత్వం రూ.3 కోట్లు నిధులు మంజూరు చేయగా వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.247.50 లక్షలు కేటాయించారు. అయితే ఇప్పటి వరకు రూ.128.40 లక్షల విలువ చేసే అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మరో రూ.36.79 లక్షలతో చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయి. మిగతా రూ.82.31 లక్షలతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు పూర్తి కావాల్సింది.

మల్కాజిగిరిలో సున్నా..



ఎమ్మెల్యే మైనంపల్లి

- మల్కాజిగిరిలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేయగా వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.265.50 లక్షలు కేటాయించారు. అయితే ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా పూర్తి కాలేదని తెలుస్తోంది.

ఉప్పల్‌లో అంతంతే..



ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

- ఉప్పల్‌లో సీడీపీ కింద 2021–22లో ఎమ్మెల్యే బి.సుభాష్‌రెడ్డికి ప్రభుత్వం రూ.3 కోట్లు విడుదల చేయగా వివిధ పనులకు రూ.241.74 లక్షలు కేటాయించారు. అందులో ఇప్పటి వరకు రూ.98.03 లక్షల విలువ చేసే అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మిగతా రూ.143.71 లక్షలతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

కూకట్‌పల్లిలో ఒక్కటీ పూర్తి కాలే..



ఎమ్మెల్యే కృష్ణారావు

- కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు రూ.3 కోట్లు నిధులు మంజూరు చేయగా వివిధ పనుల కోసం రూ.246 లక్షలు కేటాయించారు. అందులో ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా పూర్తి కాలేదు. ఎమ్మెల్యే అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు జాప్యంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో ఐదుగురు ఎమ్మెల్యేలకు నిధులు విడుదలై ఏడాది గడిచినా వాటి వినియోగంలో జాప్యంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని, ఆయా నియోజకవర్గాల్లో ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

అన్ని చోట్లా...ఇంకా వెయిటింగే..

2022–23 సంవత్సరానికి గాను జిల్లాలో ఐదుగురు ఎమ్మెల్యేలకు సంబంధించి రూ.15 కోట్లకు గానూ ప్రభుత్వం సీడీపీ కింద 706.55 లక్షలు కేటాయించింది. ఈ నిధులతో 165 పనులకు ఆమోదం లభించింది. అయినా.. ఇప్పటి వరకు ఒక్క పని కూడా పూర్తి కాలేదు. 2022–23లో మేడ్చల్ ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి రూ.149.85 లక్షలు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ రూ. 117 లక్షలు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు రూ. 268 లక్షలు, ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి రూ.171.70 లక్షల నిధులను వివిధ అభివృద్ధి పనుల కోసం కేటాయించినా ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు.

ఆటోపై వరినారు!



ఆటోపై ఉంచిన చాపలో వరినారు

జీడిమెట్ల: ఓ ఆటో డ్రైవర్ వినూత్నంగా ఆలోచించాడు.. తన ఆటోలో ఎక్కిన వారికి ఎండ నుంచి కాస్తా విముక్తి కలిగించేందుకు తన వంతు ప్రయత్నం చేశాడు. తన ఆటోపై భాగాన ఎండుగడ్డి, మట్టితో నింపిన పరుపులాంటి దాన్ని పరిచాడు. అందులో కొన్ని వడ్ల గింజలు సైతం వేశాడు. రోజు దానిపై నీరు చల్లుతుండటంతో ఆటోలోని ప్రయాణికులకు చల్లగా ఉంటుందని అంటున్నాడు. మట్టిలో వడ్ల గింజలు ఉండటంతో పాటు నీరు పోయడంతో ఆటో పైభాగాన వరి సైతం మొలిచింది. ఇలా ఆ ఆటో డ్రైవర్ తన ఉపాయాన్ని అమలు చేశాడు.

గోదావరి జలాలు వృథా



బాచుపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయ రోడ్డులో పారుతున్న గోదావరి జలాలు

నిజాంపేట్: జలమండలి అధికారుల నిర్లక్ష్యం కారణంగా విలువైన గోదావరి జలాలు రోడ్డుపై వృథాగా ప్రవహిస్తున్నాయి. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి గ్రామంలోని వాటర్ ట్యాంక్ వద్ద గోదావరి పైప్‌లైన్ పగలడంతో నెల రోజులుగా నీళ్లు స్థానికంగా ఉన్న హనుమాన్ ఆలయం రోడ్డుపై పారుతున్నాయి. పలుమార్లు స్థానిక వాటర్‌మెన్ దృష్టికి తీసుకువెళ్లినా అదిగో చేస్తాం.. ఇదిగో చేస్తామంటున్నారే తప్ప లీకేజీకి అరికట్టడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆగిన రోడ్డు పనులతో పరేషాన్!

కుత్బుల్లాపూర్: సంవత్సర కాలంగా ఆ రోడ్డుపై రాకపోకలు ఆగిపోయాయి.. డ్రైనేజీ పేరిట కొంతకాలం .. రోడ్డు పేరిట మరికొంత కాలం.. ఇలా ఓ సంవత్సరం గడిచిపోవడం విశేషం.. అంతవరకు బాగానే ఉన్నా.. డ్రైనేజీ పూర్తయిన వాటిలో కుత్బుల్లాపూర్ సర్కిల్ జీడిమెట్ల డివిజన్ పరిధిలో ఉన్న డీమార్ట్ నుంచి హర్ష ఆస్పత్రి వరకు ఒక టెండర్ పిలిచిన అధికారులు మరో టెండర్ అపర్ణ వరకే పిలవడంతో కళ్యాణి విల్లా నుంచి వైష్ణవి ఎన్‌క్లేవ్ మీదుగా ఎస్ఎల్ఎన్ రోడ్డు అధ్వానంగా మారింది. ప్రస్తుతం రెండు టెండర్ల ప్రక్రియ పూర్తికాగా పనులు జరిగాయి. మిగిలిన రోడ్డు నిరుపయోగంగా ఉండటంతో ఎందుకూ పనికి రాకుండా పోయింది. సుమారు రూ. 60 లక్షలతో ఈ రోడ్డు పనులు పూర్తి అవుతాయని గతంలో ప్రణాళికలు సిద్ధం చేసిన వాటికి కార్యరూపం దాల్చకపోవడం విమర్శలకు తావిస్తున్నది. దీంతో ఆ రోడ్డు వైపు వెళ్లే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతూ గమ్యస్థానానికి చేరుకుంటున్నారు.

అల్వాల్‌కు షార్ట్ కట్ రోడ్డు...

జాతీయ రహదారి–44 నుంచి అల్వాల్‌కు వెళ్లాలంటే ఇది షార్ట్ కట్ రోడ్డు. డీమార్ట్ మీదుగా అపర్ణ అపార్ట్‌మెంట్ నుంచి వైష్ణవి మీదుగా గతంలో వెళుతూ ఉండేరు. అయితే ఇక్కడ డ్రైనేజీ, రోడ్డు ఏర్పాటు విషయంపై కాంట్రాక్టర్ నెమ్మదిగా పనులు చేయడం మూలంగా చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు మీదుగా వెళ్లే చుట్టుపక్కల కాలనీవాసులు ఇబ్బందులు మరి తీవ్రంగా ఉన్నాయి. పరిశ్రమలకు వెళ్లాల్సిన కార్మికులతో పాటు ఉద్యోగాలు చేసుకునేవారు, పిల్లలను స్కూలుకు తీసుకువెళ్లే తల్లిదండ్రుల బాధలు వర్ణనాతీతం. డ్రైనేజీ పనులు పూర్తయిన నేపథ్యంలో అధికారులు వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు చేయాలని ఆయా సంక్షేమ సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.



అధ్వానంగా తయారైన వైష్ణవి ఎన్‌క్లేవ్ మెయిన్‌గేటు ముందు రోడ్డు

అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్

నిజాంపేట్: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ 21వ వార్డులోని బాయుపల్లి సాయినగర్‌లో ప్రగతియాత్రలో భాగంగా ఆయన మేయర్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా తాగునీటి పైపులైన్ వ్యవస్థ, డ్రైనేజీ లైన్లు, శ్మశానవాటిక, పార్కులను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

బస్తీదవాఖానాలను ప్రారంభించిన ఎమ్మెల్యే...

నిజాంపేట్ కార్పొరేషన్ 12వ డివిజన్‌లోని ఇందిరమ్మ కాలనీ ఫేజ్–2, 31వ డివిజన్ రాజీవ్‌గృహకల్పలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలను మేయర్ నీలారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ నిర్మలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసిందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణారావు, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ ఆగం పాండుముదిరాజ్, కార్పొరేటర్ ఆవుల ప్రసన్న, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



సాయినగర్‌లో ప్రగతియాతలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్

ఘనంగా కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ జన్మదిన వేడుకలు



చిన్నారికి కేక్ తినిపిస్తున్న విజయశేఖర్‌గౌడ్

చింతల్: రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఆయనతో కేక్‌లు కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. హెచ్‌ఎంటీలోని నిర్మాణ్ మానసిక వికలాంగుల, అనాథ ఆశ్రమంలో కార్పొరేటర్ కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ మూడవ ఫేజ్‌లో షార్ట్ సర్క్యూట్‌తో పేపర్‌షాపు శుక్రవారం అర్ధరాత్రి దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి షాపు యజమానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సురేష్ రెడ్డి, భాస్కర్, జీఎల్ రెడ్డి, కచ్చిన్, పద్మారెడ్డి, సుబ్బురాము తదితరులు పాల్గొన్నారు.

సంబరాల్లో కాంగ్రెస్ శ్రేణులు



సంబరాల్లో పాల్గొన్న కొలన్ హన్మంతరెడ్డి



కొంపల్లిలో మున్సిపల్ అధ్యక్షుడు భైరి ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో...

కుత్బుల్లాపూర్: కర్నాటక రాష్ట్ర శాసన సభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించడంపై శనివారం కుత్బుల్లాపూర్ నియోజవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకొన్నారు. టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో బాచుపల్లి, షాపూర్‌నగర్, ఐపీడీఎల్ చౌరస్తాల్లో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించి బాణాసంచా పేల్చి స్వీట్లు పంచారు. అదే విధంగా కొంపల్లిలో మున్సిపల్ అధ్యక్షుడు భైరి ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.



ఉప్పల్ స్టేడియంలో శనివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌ను చూసేందుకు వచ్చిన ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తదితరులు

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు అడ్డు అదుపు లేకుండా కొనసాగుతున్నాయి. ఇప్పటికే పలుచోట్ల నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయల ప్రభుత్వ ఆదాయం గండి పడుతోంది.

- ఇష్టారాజ్యంగా కొనసాగుతున్న నిర్మాణాలు
- దైవాధీనంగా మారుతున్న అనుమతులు
- పట్టించుకోని అధికారులపై సర్వత్రా ఆగ్రహం

సుభాష్‌నగర్: దూలపల్లి గ్రామంలోని 18వ వార్డులో ఓ పార్కు స్థలం, అదే విధంగా రోడ్డు రెండు కలిపి ఓ ప్రైవేట్ స్కూలు యాజమాన్యం దర్జాగా అక్రమ నిర్మాణం చేపట్టాడు. ఈ నిర్మాణ విషయంపై సమాచార హక్కు చట్టం కింద వివరాల కోసం ఆరా తీస్తే ఎటువంటి అనుమతులు లేవని తేలింది. లేఅవుట్ లో పార్కు.. రోడ్డు స్థలం దూలపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 65లో ఓ ప్రైవేటు స్కూలు యజమాని రోడ్డు, పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతూ వచ్చాడు. అంతేకాకుండా బహుళ అంతస్తు నిర్మాణాలు చేపట్టాడు. ఇదేమని ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నాడని స్థానికుల ప్రధాన ఆరోపణ. సుమారు రూ. ఐదు కోట్ల విలువ చేసే వెయ్యి గజాల స్థలం కలిపి 300 గజాల్లో అక్రమ నిర్మాణం చేపట్టాడని ఫిర్యాదులు చేశారు. దీంతో స్థానికంగా ఉండే మాజీ సింగిల్ విండో చైర్మన్ పడకంటి నవీన్‌గుప్తా కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో గత నెల 26వ తేదీన సదర్ బిల్డింగు రోడ్డు, పార్కు స్థలం పై సమాచార హక్కు చట్టం కింద వివరాల కోసం దరఖాస్తు చేసుకున్న అధికారుల నుంచి ఇప్పటివరకు సమాధానం లేదు.. అఫ్‌ద రికార్డుగా వాటికి ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణం ఆపినట్లే ఆపి తర్వాత పచ్చజెండా ఊపడంతో సదర అక్రమ నిర్మాణం పనులు వేగవంతం చేసి పూర్తి చేయడం విశేషం.



దూలపల్లి 18వ వార్డులో పార్కు స్థలంలో చేపట్టిన బహుళ అంతస్తుల నిర్మాణం



రోడ్డును కబ్జా చేసి గేటు ఏర్పాటు చేసిన దృశ్యం

చర్యలు తథ్యం



సదరు నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవు. పాఠశాల యజమానితో మాట్లాడి స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు పరిశీలిస్తాం. టౌన్ ప్లానింగ్ అధికారి సెలవులో ఉన్నందున దూలపల్లి సింగిల్ విండో మాజీ చైర్మన్ పడకంటి నవీన్‌గుప్తా పెట్టుకున్న సమాచార హక్కు చట్టం దరఖాస్తుకు రిప్లై ఇవ్వలేకపోయాం. త్వరలోనే పూర్తి వివరాలు తీసుకొని నివేదిక అందజేస్తాం. అక్రమ నిర్మాణం అని తేలితే తప్పకుండా చర్యలు తప్పవు.

– శ్రీహరి, కొంపల్లి మున్సిపల్ కమిషనర్

తాగునీటి సమస్య పరిష్కారంలో విఫలం: బీజేపీ

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో తాగునీటి ఎద్దడిని తీర్చడంతో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఘోరంగా విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి ఆరోపించారు. నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం నిజాంపేట్ వాటర్ వర్క్స్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం వేపచెట్టుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ... కార్పొరేషన్ పరిధిలో 3 లక్షల పైచిలుకు జనాభాతో 14,551 కనెక్షన్‌లు ఉన్నా నేటికీ పూర్తి స్థాయిలో నీటి వసతి కల్పించడం లేదన్నారు. 13.5 ఎంజీడీల తాగునీరు అవసముంటే సగం కూడా అందించడం లేదన్నారు. దీంతో రాజీవ్‌గాంధీనగర్, సాయినగర్ తదితర బస్తీల ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జల మండలి అధికారులకు ఎన్నిసార్లు విన్నపాలు చేసినా నీటి సరఫరాలో తీరు మాత్రం మారడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజల ఇబ్బందులు పట్టించుకోకుంటే పెద్ద సంఖ్యలో జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ మోర్చా మహిళా ప్రముఖ్ అమలేశ్వరి, రాష్ట్ర ఎస్సీ మోర్చా జాయింట్ కన్వీనర్ దాసి నాగరాజు, జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రమౌళి, కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి భిక్షపతి, నరేంద్ర, కార్యదర్శులు ప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాస్‌గుప్తా, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు, ఉపాధ్యక్షుడు మాధవరావు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొంకి రాము, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ , మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పావనీరెడ్డి, బీజేవైఎం నేత రవీంద్ర, సీనియర్ నాయకులు సుమన్ రావు, సైదులు తదితరులు పాల్గొన్నారు



వేప చెట్టుకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు